

జలం..అందనంత దూరం

జిల్లాలో మంచినీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. భూగర్భ జలాలు అడుగంటాయి. జిల్లాలోని 95 గ్రామాల్లో కొత్త బోర్లు వేయడాన్ని ప్రభుత్వం నిషేధించింది. -4లో..



కూటమి ప్రభుత్వానివి ప్రజా వ్యతిరేక విధానాలు

కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. -4లో..

గరిష్ఠం/కనిష్ఠం 40 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. ఒకటి రెండు చోట్ల **ఉరుములు మెరుపులతో** జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

బంగారు బాల్యం రిసోర్స్ సెంటర్ పరిశీలన



రిసోర్స్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా స్పెషల్ ఆఫీసర్ సురేష్ కుమార్, కలెక్టర్

ఒంగోలు సబర్బన్: జిల్లా స్పెషల్ ఆఫీసర్ సురేష్ కుమార్ శనివారం ప్రకాశం భవన్‌లోని బంగారు బాల్యం రిసోర్స్ సెంటర్‌ను పరిశీలించారు. డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్‌కు సంబంధించిన వివరాలను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను అడిగి తెలుసుకున్నారు. సెంటర్ ఏర్పాటు నేపథ్యం, కార్యక్రమాన్ని అమలు చేస్తున్న తీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు ఉన్నారు.

ఎస్సీ రుణాలకు వయోపరిమితి పెంచాలి

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ రుణాలకు వయోపరిమితి పెంచాలని ఎస్సీ రుణాల అమలు జాయింట్ యాక్షన్ ఫోరం కన్వీనర్లు కొమ్ము సుజన్ మాదిగ, చప్పిడి వెంగళరావు, తొరటి ఆనంద్ మాదిగ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒంగోలులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకు లింకేజీ రుణాలు అందించేందుకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసిందని, అయితే ఎస్సీ నిరుద్యోగులకు 50 ఏళ్ల లోపు వయోపరిమితి విధించడంతో చాలా మంది నిరుద్యోగ ఎస్సీలు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలని, రుణాలు పొందేందుకు కూడా 55 సంవత్సరాలు పెంచాలన్నారు. ఎస్సీ జనాభా దామాషా ప్రకారం యూనిట్లను పెంచాలన్నారు.

ప్యాకేజీ..పాపాలు..!

వందల సంవత్సరాల నుంచి అవి దేవాలయాల భూములు.. వెలిగొండ ముంపు ప్రాంతాల పరిధిలోకి రావు.. అయితేనేం.. టీడీపీ నాయకుడు, అతని అనుచరులతో అధికారులు కుమ్మక్కయ్యారు. వాటిని ముంపు ప్రాంతాలుగా చూపించి పరిహారాన్ని నొక్కేశారు. రూ.1.60 కోట్ల సొమ్మును జేబులో వేసుకున్నారు. పెద్దారవీడు మండలంలో టీడీపీ నాయకుడు, వారి అనుచరుల ఘనకార్యమిది. చర్యలు తీసుకోవాలని ఆలయ పూజారి అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం శూన్యం.

- కాటమరాజు, గంగాభవాని ఆలయాలు, భూములు వెలుగొండ ఆర్‌ఆర్ ప్యాకేజీలో..
- పరిహారం కింద రూ.1.60 కోట్లు స్వాహా
- టీడీపీ నాయకుడితో కుమ్మక్కైన అధికారులు
- దర్యాప్తు చేయాలని స్పెషల్ కలెక్టర్‌కు ఆలయ పూజారి, ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం వినతి



కాటంరాజు స్వామి ఆలయం



రికార్డులు తారుమారు

వేనూతల కాటమరాజు స్వామి, గంగా భవానీ ఆలయాలకు సంబంధించిన భూముల రికార్డులు తారుమారు చేశారు. సర్వే నంబరు 630లో 2.69 ఎకరాలు, సర్వే నంబర్ 629లో 4.70 ఎకరాలు ఆర్‌ఎస్‌ఆర్ రికార్డులో స్వామి పేరున ఉన్నాయి. 2016లో కలనూతల రెవెన్యూ పరిధిలో స్వామి, అమ్మవార్ల భూములను కాటమరాజు తండాకు చెందిన దేశావత్ ఆదెమ్మ, బిలావత్ బుజ్జమ్మల పేరు మీద రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చేశారు. మామూళ్లకు ఆశపడి రెవెన్యూ అధికారులు రికార్డులను తారుమారు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వం దేవాలయానికి నిత్యం పూజలు జరిగేలా, ప్రాజెక్టు మునకలో పోకుండా చర్యలు తీసుకుందని ఆలయ పూజారి పాముల రుషికేశవ తెలిపారు. దేవాలయ భూములకు సంబంధించిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరానని ఆయన చెబుతున్నారు.

యర్రగొండపాలెం:

ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలో తాగు, సాగునీటి కొరత తీర్చేందుకు వెలిగొండ ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. సుమారు 53.58 టీఎంసీల సామర్థ్యం ఉండేలా రిజర్వాయర్ నిర్మించి 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ప్రాజెక్టు భూసేకరణలో భాగంగా భూములు కోల్పోయిన 4,617 మంది నిర్వాసితులకు 'రీహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్' (ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీ కింద పరిహారం చెల్లించాల్సి ఉంది. దీనిపై టీడీపీ నాయకులు కన్నేశారు. అధికారులతో కుమ్మక్కయ్యారు. బినామీలతో నిధుల స్వాహాకు పథకం రచించారు. పెద్దారవీడు మండలం గుండంచెర్ల గ్రామానికి సమీపంలో కాటంరాజు స్వామి, గంగాభవానీ ఆలయాలు సర్వే నంబర్లు 629, 630లలోని 7.39 ఎకరాల్లో వందల సంవత్సరాల కిందటి నుంచి ఉన్నాయి. ఇవి వెలిగొండ ప్రాజెక్టు ముంపు ప్రాంతంలో లేవు. అయినా గుండంచెర్ల గ్రామ టీడీపీ నాయకుడు ముంపు భూములంటూ ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద చూపించారు.

మరో 50 ఎకరాల భూములను..

దేవుడి మాన్యం ఒకవేళ ముంపులో ఉంటే ఆర్‌ఆర్ చట్టం కింద పరిహారం నిధులు దేవదాయ శాఖకు చెందాల్సి ఉంటుంది. కాగా టీడీపీ నాయకుడు దేవుని మాన్యం మరో 50 ఎకరాల భూములను కూడా బినామీ పేర్లతో ఆర్‌ఆర్ ప్యాకేజీలో చేర్చి జేబులు నింపుకొన్నారు. తమ ప్రాంతం వారు కానప్పటికీ అర్ధవీడు మండలం మావుటూరు తండాకు చెందిన 13 మంది పేర్లను ప్యాకేజీలో చేర్చి ఒక్కొక్కరికి రూ.12.50 లక్షల ప్రకారం ప్రభుత్వం నుంచి ఇప్పించారు. ఈయనతో పాటు మరికొందరు.. ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షల ప్రకారం రూ.65 లక్షలు తీసుకున్నారు. వీరిలో జిల్లా భూ సేకరణ, రెవెన్యూ అధికారుల హస్తం ఉందని, ఈ అవినీతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమాలపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని స్పెషల్ కలెక్టర్‌కు కాటంరాజు ఆలయ పూజారి వినతిపత్రం ఇచ్చినా స్పందన శూన్యం. గత నెల 28వ తేదీన ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం కార్యదర్శి గాలి వెంకటరెడ్డి సైతం స్పెషల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇంత వరకూ అధికారుల నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

"వాస్తవ లబ్ధిదారులకు నష్టపరిహారం చెందాలి

వెలిగొండ ప్రాజెక్ట్ మునక ప్రాంతాల్లో ఉన్న వాస్తవ లబ్ధిదారులకు నష్టపరిహారం చెందేలా చర్యలు తీసుకోవాలి. కాటమరాజు, గంగా భవాని అమ్మవార్ల ఆలయాలతో పాటు భూములకు కూడా బినామీ పేర్లతో ఆర్‌ఆర్ ప్యాకేజీ పొందారు. అయితే గుండంచెర్ల గ్రామంలోని ఉన్న 12 మంది చెంచులను అర్హులుగా చేర్చి నష్ట పరిహారం వారికి అందేలా చర్యలు తీసుకోవాలి. కస్నూతల గ్రామంలో ఉన్న 50 మంది చెంచులకు కూడా సాయం అందించాలి. బినామీ పేర్లతో ప్రభుత్వ నిధులను స్వాహా చేసిన టీడీపీ నాయకులు, రెవెన్యూ, భూ సేకరణ అధికారులపై చర్యలు తీసుకోవాలి. స్పెషల్ కలెక్టర్ కార్యాలయంలో గత నెల 28వ తేదీ అర్జీ ఇచ్చినా చర్యలు తీసుకోలేదు.

– గాలి వెంకటరామిరెడ్డి, కార్యదర్శి,
వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితుల సంఘం



హనుమంత వాహనంపై దేవదేవుడు



స్వామివారి సేవలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, కుటుంబ సభ్యులు



హనుమంతవాహన సేవలో పాల్గొన్న భక్తజనం

మార్కాపురం టౌన్: స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవీ భూదేవీ సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామివారు హనుమంత వాహనంపై అశేష భక్తజన గోవింద నామస్మరణల మధ్య శనివారం ఉదయం నాలుగు మాఢ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున 4 గంటలకు ప్రారంభమైన స్వామివారి నగరోత్సవం ఉదయం 9 గంటల వరకూ సాగింది. స్వామివారి ఊరేగింపు ముందు కోలాటాలు, నృత్య ప్రదర్శనలు, కళారూపాలు ఆకట్టుకున్నాయి. వాహన సేవలో మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఆయన తనయుడు కృష్ణచైతన్య, కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, జనసేన ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావుతోపాటు పలువురు నాయకులు, అధికారులు, పట్టణ ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పట్టణ సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్సైలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ ప్రభలు:

చెన్నకేశవుని బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రికి వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తున్నారు.ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

స్థానిక వనరులను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ అధికారి సురేష్ కుమార్, పక్కన కలెక్టర్ తదితరులు

- జిల్లా స్పెషల్ ఆఫీసర్ సురేష్ కుమార్

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా స్థానిక వనరులను సద్వినియోగం చేసుకోవాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఎస్. సురేష్ కుమార్ అన్నారు. శనివారం జిల్లాకు వచ్చిన ఆయన అన్ని శాఖల ఉన్నతాధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అన్ని విధాలా అభివృద్ధి చెందేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రీవెన్స్, ధాన్యం సేకరణ, దీపం, అన్న క్యాంటీన్, రెవెన్యూ సదస్సులు, విద్య, వైద్యం, సంక్షేమం, పౌర సరఫరాలు, వ్యవసాయం, ఉద్యానవనం, పసుసంవర్ధక, మత్స్య, గనులు, పరిశ్రమలు, రహదారులు, భవనాలు, పారిశుధ్యం–తాగునీరు, పీఎం సూర్య ఘర్, డ్వామా, హౌసింగ్, టిడ్కో, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన, తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. రెవెన్యూ సదస్సుల్లో, 'మీ కోసం' కార్యక్రమాల్లో వస్తున్న అర్జీల పరిష్కారంలో నాణ్యత అత్యంత కీలకమన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రెవెన్యూ సమస్యలకు సంబంధించిన అర్జీల పరిష్కారంలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నట్లు చెప్పారు. అసైన్డ్ భూములు, నిషేధిత జాబితాలోని భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన కేసులు ఉన్నాయన్నారు. మండల స్థాయి నుంచి ఈ కేసులను రాష్ట్ర ప్రభుత్వానికి అధికారులు నివేదిస్తున్న క్రమంలో తమ సమస్యలు పరిష్కారం కాలేదంటూ అర్జీలను ప్రజలు రీ ఓపెన్ చేస్తున్నారని ఆమె వివరించారు. రీ ఓపెన్ అవుతున్న అర్జీలను ఆడిట్ చేయడానికి ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. తమ శాఖల పరంగా తీసుకుంటున్న చర్యలను సంబంధిత ఉన్నతాధికారులు వివరించారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మి ప్రసన్న, కనిగిరి ఆర్‌డీఓ కేశవర్ధన్ రెడ్డి, సీపీఓ వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో ఒంగోలుది 15వ స్థానం



ర్యాలీలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జ్ అధికారి ఎస్.సురేష్ కుమార్, పక్కన కలెక్టర్ తమీమ్ అన్సారియా

- జిల్లా ఇన్‌చార్జ్ అధికారి ఎస్.సురేష్ కుమార్
- ఒంగోలులో స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర ర్యాలీ
- ఈ–వేస్ట్ రీసైక్లింగ్ కేంద్రం ప్రారంభం

ఒంగోలు సబర్బన్: స్వచ్ఛత కార్యక్రమంలో ఒంగోలు కార్పొరేషన్ రాష్ట్రంలో 15వ స్థానంలో ఉందని జిల్లా ఇన్‌చార్జి అధికారి, మున్సిపల్ పరిపాలన, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ సురేష్ కుమార్ పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఒంగోలు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఒంగోలు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని సురేష్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ పీవీఆర్ హైస్కూల్ నుంచి కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఈ–వ్యర్థాల సేకరణ కేంద్రం వరకు సాగింది. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ 15వ స్థానంలో ఉన్న ఒంగోలు నగరాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ–వ్యర్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతుల్లో రీ సైక్లింగ్ చేయడం అనే నినాదాలతో కార్యక్రమాన్ని కొనసాగించారు. అనంతరం కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన ఈ వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. షాదీఖానాలో ఈ–వ్యర్థాల నిర్వహణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సురేష్ కుమార్ మాట్లాడారు. చెత్తను సక్రమంగా సురక్షితంగా ప్రాసెస్ చేస్తే ఆ చెత్త నుంచి సంపదను రాబట్టవచ్చన్నారు. వంద శాతం డోర్ టు డోర్ చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా సేకరించినప్పుడే అది సాధ్యమవుతున్నారు. ఐదేళ్ల నుంచి ఇండోర్ నగరం స్వచ్ఛ కార్యక్రమంలో మొదటి స్థానంలో నిలుస్తోందన్నారు. ఒంగోలు కూడా ఇండోర్ మాదిరిగా మొదటి స్థానంలో నిలిచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్నీ మునిసిపాలిటీల్లో ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా, శానిటేషన్ ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టేలా రూ.10 వేల కోట్లు ఖర్చుచేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. అందులో భాగంగా ఒంగోలు నగరానికి రూ.410 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం ఒక్కొక్క నెల ఒక్కొక్క థీమ్‌తో స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, నగర మేయర్ జి.సుజాత, ఏపీ పర్యటకాభివృద్ధి సంస్థ చైర్మన్ బాలాజీతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన జిల్లా విద్యార్థులు

ఒంగోలు సిటీ: జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులతో మెరిశారు. ఒంగోలు నగరానికి చెందిన రఘునాథ్ మకానీ జాతీయ స్థాయిలో 29వ ర్యాంకు, కాపా షణ్ముఖ సాయిరెడ్డి ఆల్ ఇండియా స్థాయిలో ఓపెన్ క్యాటగిరీలో 52 వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కోటాలో ఆల్ ఇండియాలో 2వ ర్యాంకు సాధించారు. దర్శికి చెందిన ఎస్.వెంకటసాయిచక్రి ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరీలో 646 వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కోటాలో 48వ ర్యాంకు సాధించాడు.

ఒంగోలుకు చెందిన కాపా షణ్ముఖ సాయిరెడ్డి, దర్శికి చెందిన ఎస్.వెంకట సాయిచక్రి తమ సంస్థల్లో చదివి ఉత్తమ ఫలితాలు సాధించారని భాష్యం విద్యా సంస్థల జోనల్ ఇన్‌చార్జ్ శ్రీ కృష్ణ గణేష్ తెలిపారు. అలాగే ఒంగోలు శివాజీ నగర్ ఎం.సాకిత్ రామ్ కమల్ ఈడబ్ల్యూఎస్ కోటాలో 409 వ ర్యాంకు సాధించాడన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, ఆయా బ్రాంచ్‌ల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

శ్రీ సరస్వతి విద్యా సంస్థలు విద్యార్థులు జేఈఈ మెయిన్స్ (సెషన్స్–2) ఫలితాల్లో సత్తా చాటారు. శ్రీ సరస్వతి విద్యా సంస్థల విద్యార్థులు ఎస్. ఇంద్రసేనా రెడ్డి 99.21 టాప్ పర్సంటైల్, కె.లోక్ క్రితి 98.82, కె.గుణశేఖరరెడ్డి 98.71 టాప్ పర్సంటైల్ సాధించారు. అలాగే జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆల్ ఇండియాలో క్యాటగిరీ కింద ఎం.రఘునాథ్ మకాని 29వ ర్యాంకు, కె.లోక్ క్రితి 453 వ ర్యాంకు, వి.మణికంఠబాబు 1329 వ ర్యాంకు, ఎస్.ఇంద్రసేనారెడ్డి 1563వ ర్యాంకు, బి.రిత్విక్ 1632వ ర్యాంకు, జి.ఎనూష్‌రాయ్ 1870వ ర్యాంకు, కె.గుణశేఖరరెడ్డి 2698 వ ర్యాంకు సాధించారు. జేఈఈ మెయిన్స్ (సెషన్స్–1, పేపరు–2) 2025లో ఇండియా ప్రథమ స్థానంలో టాప్ పర్సంటైల్ సాధించిన కె.లోక్‌క్రితి 99.94 ఆల్ ఇండియాలో ఉత్తమ ఫలితాలు సాధించిందని శ్రీ సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఎ.వి.రమణారెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. 90 శాతం పైన సాధించిన విద్యార్థులు 20 మంది, 80 శాతం పైన సాధించిన విద్యార్థులు 54 మంది, 70 శాతం పైన సాధించిన విద్యార్థులు 130 మంది, ఆల్ ఇండియా క్యాటగిరీలో 3 వేలలోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఏడుగురు ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ఆల్ ఇండియా స్థాయిలో శ్రీ సరస్వతి విద్యా సంస్థలకు గుర్తింపు తీసుకురావడానికి సహకరించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, డైరెక్టర్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతి విద్యా సంస్థల డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగా శంకరరెడ్డి, సీఈఓ ఎస్.వి. సురేష్, డీన్స్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీ సరస్వతి విద్యా సంస్థల చైర్మన్ రమణారెడ్డి



విద్యార్థి సాయి షణ్ముక సాయిరెడ్డిని అభినందిస్తున్న భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ

ఉత్సాహంగా జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు



పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జత

మార్కాపురం టౌన్: మార్కాపురం లక్ష్మీచెన్నకేశవస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్‌వీకేపీ కళాశాలలో జరుగుతున్న జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు 2వ రోజైన శనివారం ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలకు గుంటూరు, నంద్యాల, బాపట్ల, తెలంగాణలోని సూర్యాపేట, పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొన్నాయి. శనివారం పోటీల్లో గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెద్దగొట్టిపాడు గ్రామానికి చెందిన జీఎల్‌ఆర్ గ్రూప్స్, గరికపాటి లక్ష్మయ్యచౌదరిలకు చెందిన ఎడ్ల జత 4351.06 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతిని, నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బీ కేశవరెడ్డికి చెందిన ఎడ్ల జత 4325.09 అడుగుల దూరంలాగి రెండో స్థానాన్ని, బాపట్ల జిల్లా వేటపాలెం మండలం చుండూరుకు చెందిన ఆర్‌కె బుల్స్, శిరీషా చౌదరికి చెందిన ఎడ్ల జత 4291.10 అడుగులు లాగి మూడో బహుమతిని, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్‌కు చెందిన జే సహస్రయాదవ్, జేవీఎల్ యాదవ్‌కు చెందిన ఎడ్ల జత 3881.10 అడుగులు లాగి 4వ స్థానాన్ని సాధించాయి.

క్లుప్తంగా

బైకును ఢీకొన్న ట్రాక్టర్.. యువకుడి మృతి


ఎర్రన్న మృతదేహం

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని వేంపాడు అంజనేయ స్వామి ఆలయం వద్ద బైకును ట్రాక్టర్ ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి జరిగింది. వివరాలు.. మండలంలోని రమణారెడ్డిపాలెం గ్రామానికి చెందిన గోపనబోయిన ఎర్రన్న (30) తన ద్విచక్ర వాహనంపై అద్దంకి వెళ్లి పనులు ముగించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. వేంపాడు అంజనేయస్వామి ఆలయం వద్దకు వచ్చే సరికి ఎదురుగా కర్రల లోడుతో వస్తున్న ట్రాక్టర్ ట్రక్కు తగిలి ఎర్రన్న కిందపడి గాయపడ్డాడు. 108కి సమాచారం అందించటంతో సిబ్బంది వచ్చి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అద్దంకి తరలిస్తుండగా మార్గంమధ్యలో ఎర్రన్న మృతి చెందినట్లు 108 సిబ్బంది తెలిపారు.

అంతర్ జిల్లాల దొంగలు అరెస్టు

- పది లక్షల విలువైన బంగారంతో పాటు రెండు బైకులు స్వాధీనం
- తక్కువ సమయంలోనే చైన్‌స్నాచర్ల అరెస్టు
- పోలీసులను అభినందించి రివార్డులు ఇచ్చిన డీఎస్పీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మొయిన్

మేదరమెట్ల: పలు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు అంతర్ జిల్లాల దొంగలను కొరిశపాడు మండలం మేదరమెట్ల వై.జంక్షన్ వద్ద శనివారం మేదరమెట్ల పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై చీరాల డీఎస్పీ ఎస్‌డీ మొయిన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీ సాయంత్రం వరుసగా రెండు చైన్‌స్నాచింగ్ సంఘటనలు మేదరమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగాయి. దీనిపై ఎస్పీ ఆదేశాల మేరకు అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు మేదరమెట్ల, కొరిశపాడు, పంగులూరు ఎస్‌ఐలు షేక్ మహ్మద్ రఫీ, వై.సురేష్, బి.వినోద్ బాబులు టీమ్‌గా ఏర్పడి సీసీ కెమెరాల ఆధారంగా ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ దొంగల కోసం ఆధారాలను సేకరించారు. కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన దర్శనాల ఏడుకొండలు, అదే గ్రామానికి చెందిన షేక్ ఆషిద్‌లను వై.జంక్షన్ వద్ద అరెస్టు చేశారు. నిందితుల నుంచి 126 గ్రాములు బంగారు చైన్‌లు, రెండు మోటారు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఏడుకొండలుపై గతంలో చీమకుర్తి స్టేషన్‌లో మూడు, టంగుటూరు స్టేషన్‌పరిధిలో ఒక కేసు నమోదై ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. రెండో నిందితుడు షేక్ ఆషిద్‌పై కొత్తపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో ఒకటి, ఒంగోలు ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో రెండు దొంగతనాల కేసులు ఉన్నట్లు చెప్పారు. ఇప్పుడు వీరిద్దరూ అరెస్టు కాకుండా ఉంటే ముప్పవరం, పంగులూరు, కొరిశపాడు సమీప గ్రామాల్లో చైన్‌స్నాచింగ్‌లు పెరిగి పోయేవన్నారు. వేసవి కాలం కావడంతో దొంగతనాలు పెరిగే అవకాశం ఉందని, ఒంటరిగా ఉండే మహిళలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ హెచ్చరించారు. అంతర్ జిల్లాల దొంగలను పట్టుకున్న సందర్భంగా సీఐ, ఎస్‌ఐలు నాయబ్ రసూల్, తిరుపాల్‌రెడ్డి, జి.సురేష్, ఎన్.రమేష్‌లను రివార్డులతో డీఎస్పీ అభినందించారు.


దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న మోటారు బైకులు



జిల్లాలో మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. భూగర్భ జలాలు అందనంత దూరానికి చేరుకున్నాయి. లోతైన బోర్లు వేసినా ఉపయోగం ఉండటం లేదు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 95 గ్రామాల్లో కొత్తగా బోర్లు వేయడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే అధికారికంగా 17 మండలాలు కరువు ప్రాంతాల జాబితాలోకి ఎక్కాయి. ఇంకా అనేక ప్రాంతాల్లో నీటి సమస్యతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి ప్రారంభంలోనే ఇలాంటి దుస్థితి దాపురించడంతో రైతులు, ప్రజలు తీవ్రస్థాయిలో ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమయ్యారు.

జలం.. అందనంత దూరం..!

- జిల్లాలో పాతాళానికి పడిపోయిన గంగ
- అట్టడుగుకు చేరిన భూగర్భ జలాలు
- జిల్లాలోని 95 గ్రామాల్లో కొత్త బోర్ల నిషేధం
- మంచినీటికి డేంజర్ బెల్స్

మార్కాపురం: జిల్లాలో పూర్తిగా అడుగంటిన భూగర్భ జలాలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. లోతైన బోర్లకు సైతం మంచినీరు అందడం లేదు. జిల్లాలోని 95 గ్రామాల్లో పరిమితికి మించి మంచి నీటి వాడకం ఉండటంతో ఆయా ప్రాంతాల్లో కొత్త బోర్లను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే జిల్లాలోని 17 మండలాల్లో కరువు పరిస్థితులు ఏర్పడటంతో వాటిని కరువు ప్రాంతాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. పుల్లలచెరువు, దొనకొండ, కురిచేడు, మర్రిపూడి, కంభం, తర్లుపాడు, పెద్దారవీడు, సంతనూతలపాడు, ఒంగోలు, వెలిగండ్ల, బేస్తవారిపేట, కొనకనమిట్ల, మార్కాపురం, చీమకుర్తి, సీఎస్ పురం, పామూరు, రాచర్ల మండలాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం రోజురోజుకూ ఎండలు పెరగడం, మూడు నెలల నుంచి జిల్లాలో వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. అధికారులు, పాలకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని సాగర్ నీరు తెప్పించి చెరువులు నింపడంలో విఫలమవడం కూడా ఈ దుస్థితికి కారణంగా తెలుస్తోంది.

> జిల్లాలో ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటిపోతున్నాయి. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో మార్కాపురం, యర్రగొండపాలెం, తర్లుపాడు, రాచర్ల, త్రిపురాంతకం, పుల్లలచెరువు, పెద్దారవీడు, గిద్దలూరు, దోర్నాల, దొనకొండ మండలాలు ఉన్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం 8 మీటర్ల లోతు దాటితే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినట్లే. దీంతో డీప్‌బోర్లు కూడా పనిచేయవు. పశ్చిమ ప్రకాశంలోని పలు గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. బోర్లు కూడా పనిచేయడం లేదు. ఏప్రిల్‌లోనే తీవ్రత ఇలా ఉంటే.. ఇక మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందోనని జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారు.
>
> **8 మీటర్లు దాటితే ప్రమాదకర పరిస్థితులు...**

కొత్త బోర్లు నిషేధించిన గ్రామాలివే...

కంభం మండలంలోని కంభం, జంగంగుంట్ల, కందులాపురం, ఎల్.కోట, దొనకొండ మండలంలోని అనంతవరం, భూమనపల్లె, కొచ్చర్లకోట, మల్లంపేట, మంగినిపూడి, రుద్రసముద్రం, దోర్నాల మండలంలోని చిన్నదోర్నాల, దోర్నాల, నల్లగుంట్ల, పెద్దబొమ్మలాపురం, ఎగువచెర్లోపల్లి గ్రామాల్లో నూతన బోర్లకు అనుమతిని ప్రభుత్వం నిషేధించింది. అదేవిధంగా గిద్దలూరు మండలంలోని చట్టిరెడ్డిపల్లి, గడికోట, కంచుపల్లి, క్రిష్ణంశెట్టిపల్లి, మోడంపల్లి, ముండ్లపాడు, నర్సింహునిపల్లి, సంజీవరాయునిపేట, తిమ్మాపురం, కురిచేడు మండలంలోని ఆవులమంద, కల్లూరు, ముష్టగంగవరం, వెస్ట్ కాశీపురం, మార్కాపురం మండలంలోని బడేఖాన్‌పేట, భూపతిపల్లి, బొందలపాడు, చింతగుంట్ల, జమ్మనపల్లి, కోలభీమునిపాడు, మాల్యవంతునిపాడు, నికరంపల్లి, పెద్దనాగులవరం, తిప్పాయిపాలెం, వేములకోట, ముండ్లమూరు మండలంలోని ఈదర, జమ్మలమడక, కంభంపాడు ఈస్టు, కొమ్మవరం, నూజెళ్లపల్లి, పూరిమెట్ల, పెద్దారవీడు మండలంలోని బోయదగుంపుల, చట్లమిట్ల, కంభంపాడు, దేవరాజుగట్టు, గొబ్బూరు, ఓబులక్కపల్లి, పెద్దారవీడు, ప్రగళ్లపాడు, ఎస్.కొత్తపల్లి, సానికవరం, తంగిరాలపల్లి, తోకపల్లి గ్రామాల్లో కొత్త బోర్లను ప్రభుత్వం నిషేధించింది. పుల్లలచెరువు మండలంలోని అయ్యగారిపల్లి, చాపలమడుగు, చెన్నపాలెం, చౌటపాచర్ల, చౌటపల్లి, గార్లపెంట, ఇసుక త్రిపురవరం, కవలకుంట్ల, కొమరోలు, మానేపల్లి, మర్రివేముల, ముటుకుల, నర్సాపురం, పుల్లలచెరువు, రాచకొండ, శతకోడు, యండ్రపల్లి, రాచర్ల మండలంలోని ఆకవీడు, చినగానిపల్లి, చోళ్లవీడు, త్రిపురాంతకం మండలంలోని గణపవరం, లేళ్లపల్లి, మాధవవానిపల్లి, మేడపి, నర్సింగాపురం, రామసముద్రం, విశ్వనాథపురం గ్రామాల్లో కొత్తబోర్లు వేయడాన్ని ప్రభుత్వం నిషేధించింది. యర్రగొండపాలెం మండలంలోని అల్లీపాలెం, అమానిగుడిపాడు, బిళ్లగొందిపెంట, గుర్రపుసాల, లింగంవానిపల్లి, మిళ్లంపల్లి, రామచంద్రాపురం, యర్రగొండపాలెం గ్రామాల్లోనూ కొత్తబోర్లను ప్రభుత్వం నిషేధించింది.

> **95 గ్రామాల్లో బోర్లు నిషేధం**
>
> 
>
> జిల్లాలో మొత్తం 95 గ్రామాల్లో నూతన బోర్లను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పటిష్టంగా వాల్టా చట్టం అమలు చేస్తాం. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలి. భూగర్భ జలాలు అడుగంటిపోతున్న నేపథ్యంలో ప్రతి నీటిబొట్టు విలువైనదే. నీటి వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. విచ్చలవిడిగా బోర్లువేసి నీటిని వృథా చేయడం మానుకోవాలి. వర్షం నీటిని నిల్వ చేసుకునేందుకు రైతులు పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలి. ఉద్యానవన పంటలు సాగుచేస్తున్న రైతులు డ్రిప్ సిస్టం వాడుకోవాలి.
>
> – విద్యాసాగర్, డిప్యూటీ డైరెక్టర్, గ్రౌండ్ వాటర్, ఒంగోలు

జిల్లాలోని మండలాల్లో గత మూడు నెలల్లో భూగర్భ జలాలు (మీటర్లలో)

మండలం	జనవరి	ఫిబ్రవరి	మార్చి
మార్కాపురం	18.00	20.84	26.99
యర్రగొండపాలెం	32.63	46.48	47.76
అర్ధవీడు	7.76	8.88	9.30
బేస్తవారిపేట	9.06	10.56	14.13
సీఎస్ పురం	8.39	8.78	9.72
చీమకుర్తి	12.57	10.19	11.72
కంభం	11.37	13.54	15.07
దర్శి	6.79	8.70	11.02
దొనకొండ	22.81	24.50	25.54
దోర్నాల	50.11	62.75	66.95
గిద్దలూరు	31.50	38.84	50.45
హనుమంతునిపాడు	7.69	6.81	7.17
జరుగుమల్లి	3.52	3.66	4.03
కనిగిరి	7.27	7.46	7.94
కొమరోలు	8.50	8.46	11.44
కొనకనమిట్ల	9.18	11.05	14.20
కొండపి	3.59	3.75	4.11
కొత్తపట్నం	1.99	2.28	2.66
కురిచేడు	3.88	4.34	4.74
మర్రిపూడి	6.40	6.42	6.91
ముండ్లమూరు	6.26	7.12	8.10
ఎన్‌జీ పాడు	1.58	1.78	2.12
ఒంగోలు	3.27	3.57	4.44
పీసీ పల్లి	5.00	8.03	4.49
పామూరు	7.73	4.22	8.48
పెద్దారవీడు	27.28	32.20	38.17
పొదిలి	4.94	5.53	6.60
పొన్నలూరు	6.74	6.51	6.91
పుల్లలచెరువు	30.57	33.63	34.86
రాచర్ల	12.68	27.68	32.75
ఎస్ఎన్ పాడు	2.55	3.04	3.57
తాళ్లూరు	6.02	6.36	7.03
తర్లుపాడు	13.34	16.49	24.34
త్రిపురాంతకం	18.07	19.07	20.58
వెలిగండ్ల	6.74	7.03	7.44

సూర్య ఘర్ అమలు వేగవంతం చేయాలి

- అధికారులతో సమీక్షించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: జిల్లాలో పీఎం సూర్య ఘర్ అమలును వేగవంతం చేయాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం అమలు, పురోగతిపై స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో శనివారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజువారీగా పురోగతి సాధించాలని ఆదేశించారు. జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం కింద ఇప్పటివరకు 78,766 దరఖాస్తులు రాగా, అందులో 1,115 దరఖాస్తులు గ్రౌండింగ్ జరిగాయన్నారు. 736 మందికి సబ్సిడీ జమైందన్నారు. నియోజకవర్గానికి 10 వేల మంది లబ్ధిదారులుగా లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందని, అందుకనుగుణంగా మండలాలు, గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో తూర్పునాయుడుపాలెం, శంఖవరం, నాగంబొట్లపాలెం, సింగరాయకొండ, బేస్తవారిపేట గ్రామాలను ప్రత్యేక గ్రామాలుగా ఎంపిక చేసి 5 గ్రామాల్లో సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు చేపట్టిన చర్యలు, సాధించిన పురోగతిపై సమీక్షించారు. ఎక్కడైనా సబ్సిడీ రిలీజ్ చేయడంలో సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో అన్నివర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి అన్ని గ్రామాల్లోనూ సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సౌర విద్యుత్ వినియోగం వలన కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను ప్రజలకు వివరించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. వెండర్స్ వారీగా రిపోర్ట్ అందించాలని, వెండర్స్ అందరూ వారికి కేటాయించిన లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. ఈ పథకం అమలులో ప్రతిరోజూ పురోగతి రావాలని, రోజువారీగా సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, ఎల్‌డీఎం రమేష్, సోలార్ విద్యుత్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానివి ప్రజా వ్యతిరేక విధానాలు

- రూ.కోట్ల ప్రభుత్వ ఆస్తులు పెత్తందారులకు అప్పగింత
- అవినీతి పాలకుల భరతం పట్టేందుకు నడుం కట్టండి
- ఐటీ ఉద్యోగుల సమావేశంలో ఎమ్మెల్యే తాటిపర్తి


ఐటీ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: ఏపీలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పతోందని, అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే ప్రజలతో చీదరింపులకు గురవుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో త్రిపురాంతకం మండలానికి చెందిన ఐటీ విభాగం ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు దొండేటి నాగేశ్వర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు అలివికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో లిక్కర్, ఇసుక, రేషన్ మాఫియా విచ్చలవిడిగా చెలరేగిపోతున్నాయని, కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆస్తులు కబ్జా చేసుకుంటున్నారని, ఇదేమిటని అడిగిన వారిని పోలీసులతో తప్పుడు కేసులు బనాయింపచేసి అరెస్ట్‌లు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. తండ్రి సీఎంగా, తనయుడు రాష్ట్ర మంత్రిగా, దత్తపుత్రుడు ఉప ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అబాసుపాలు చేస్తున్నారని, వీరి ఆధ్వర్యంలో రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యం ఏలుతోందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యంప్రియులకు నాణ్యమైన, సరసమైన ధరలకు మద్యం అందిస్తామని చెప్పి వారి ఓట్లు దండుకున్న కూటమి నాయకులు పేదోళ్లు సేవించే చీప్ లిక్కర్ రూ.99లకు అమ్మకాలకు పెట్టారని, పెత్తందారులకు మాత్రం రూ.కోట్లాది విలువ చేసే భూములు 99 పైసలకే అప్పగించారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోనే వెనక బడిన ప్రాంతమైన యర్రగొండపాలెం నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రభుత్వం ప్రకటించక పోవడం శోచనీయమని, గ్రామీణ ప్రాంత ప్రజలు గుక్కెడు నీటి కోసం అలమటించి పోతున్నారని, పనులు లేక సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. పేద ప్రజల పరిస్థితి ఈ విధంగా ఉంటే కేంద్ర ప్రభుత్వం వారి కోసం కేటాయించే ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు అభివృద్ధి పేరుతో కూటమి నాయకులు స్వాహా చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వ కాలంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు మంచి జరిగే సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు పరిచారని, రెండు సంవత్సరాల పాటు రాష్ట్రంలో కరోనా మహమ్మరి విజృంభించి కష్టకాలంలో నెట్టివేసినా పేద ప్రజలు ఇబ్బందులు పడకూడదని సంక్షేమ పథకాలను సజావుగా అమలు పరిచారని, మహిళలకు పెద్దపీట వేసి అమ్మఒడి, ఫీజు రీయింబర్స్ లాంటి పథకాలకు సంబంధించిన నిధులను నేరుగా వారి అకౌంట్‌లో జమ చేశారని, నేడు అటువంటి పరిస్థితి లేకుండా పోయిందని, అనేక మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తమ చదువులు సక్రమంగా ముందుకు సాగడం లేదని, విద్య పూర్తి చేసిన విద్యార్థులకు ఆయా విద్యా సంస్థల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో ఐటీ ఉద్యోగులు ముందుకు వచ్చి రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. తమ ఉద్యోగ బాధ్యతలతో పాటు తమ కుటుంబం, గ్రామ పరిస్థితులను కూడా అవగాహన చేసుకొని ప్రభుత్వాన్ని నిలదీసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తాటిపర్తి పిలుపు ఇచ్చారు. సమావేశంలో త్రిపురాంతకం మండలానికి చెందిన దాదాపు 200 మంది ఐటీ ఉద్యోగులు, నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడు దుద్యాల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రురాలి మృతి


షేక్ దిల్షాన్‌బేగం

పామూరు: బైక్ ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతున్న క్షతగాత్రురాలు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనిగిరికి చెందిన షేక్ దిల్షాన్‌బేగం తన భర్త జిలానీబాషాతో కలిసి ఈ నెల 16వ తేదీన స్కూటీపై పామూరులోని బంధువుల ఇంటికి వస్తోంది. స్కూటీపై వెనుక కూర్చున్న దిల్షాన్‌బేగం మండలంలోని చిలకపాడు వద్ద 565 జాతీయ రహదారిపై అకస్మాత్తుగా కిందపడిపోగా తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రురాలికి మొదట పామూరు వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసి అనంతరం ఒంగోలు, చెన్నై, ఆ తర్వాత గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న దిల్షాన్ బేగం (47) పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి కుమారుడు షేక్ ఎజ్జాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌కానిస్టేబుల్ పి.దాసు తెలిపారు.

నేత్రపర్వంగా శ్రీవారికి వసంతోత్సవం


శ్రీవారికి వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరి వెంకటేశ్వరస్వామికి శనివారం నేత్రపర్వంగా వసంతోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సంస్మరణ సభ నిర్వహించారు. శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్ పాల్గొని మాట్లాడారు. పద కవితా పితామహునిగా ప్రసిద్ధుడైన తాళ్లపాక అన్నమాచార్యులు విరచిత సంకీర్తనలకు తన సుమధుర గానంతో జీవంపోసిన ఘనత దివంగత గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌కు దక్కుతుందని కొనియాడారు. శ్రీగిరి దేవస్థానంతో గరిమెళ్లకు ఉన్న అనుబంధాన్ని వివరించారు. అన్నమయ్య సంకీర్తనల ఆలాపనను జీవిత కాలపు తపస్సుగా భావించి ప్రజల్లో మరింత ప్రాచుర్యాన్ని ఆయన కల్పించారని వివరించారు. ప్రముఖ గాయని బొల్లాపల్లి వెంకట ఫణిదీప్తి అన్నమయ్య సంకీర్తనలలోని విశేషాలను వివరించారు. గరిమెళ్లకు ఎంతో ఇష్టమైన అన్నమయ్య సంకీర్తనలను ఫణిదీప్తి బృందం ఆలపించి భక్తులను తన్మయులను చేశారు. ప్రముఖ ఆగమ పండితులు పరాంకుశం సీతారామాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారికి విశేష స్నపన తిరుమంజనం వసంతోత్సవం, ఊంజల సేవ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి తదితరులు ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీగిరి దేవస్థానం అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.